ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

వెల : రు. 20/-

అక్టోబరు 2012



14-9-1949

8-9-2012

352

## కొడవటిగంటి రోహిణీ ప్రసాద్

కథలు : కె.వి. రమణారావు, వి వెంకట్రావు
సంస్మరణ : ప్రజాకళాకారుడు : సుద్దాల హనుమంతు
వ్యంగ్యం : డి.ఆర్. ఇంద్ర

# రెండు కలలు - ఒకే దృశ్యం

-దివికుమార్

**రెండు** గుండెలు ఒకే చప్పుడు
రెండు మనసులు ఒకే ఆలోచన
రెండు వ్యక్తిత్వాలు ఒకే జీవితం

చాలామంది స్నేహితులుంటారు
ప్రాణస్నేహితులుకూడా కొందరుంటారు
మీరు జీవితకాలపు ప్రాణస్నేహితులు
ఉద్యమ సహచర జీవిత గాములు

విప్లవం పిలుపుతో
యువ హృదయాలను
తట్టిలేపే నిప్పుకోడి
షహీదోంకా షహీద్
విప్లవానికి భావుకత కూడదన్నాడు
విప్లవ కార్యాచరణకు అని దానర్థం

విప్లవం ఒక సుందర స్వప్నం
ప్రపంచ మానవ అనుభవాల సారభూత చిత్రం

విప్లవాన్ని ప్రేమించగలవారు
ప్రేమను విప్లవీకరించగలుగుతారు
విప్లవాన్ని ప్రేమించగలవారు
జీవితాన్ని సౌందర్యవంతం చేస్తారు
విప్లవంకోసం ప్రేమైక జీవులు కావటం
విప్లవ ప్రేమికుల అనుక్షణ ప్రసవ మాధుర్యం

ఆస్తి అధికారం, రోగాలూ, ఆరోగ్యాలూ
తల్లిదండ్రుల నుండి బిడ్డలకు సంక్రమించవచ్చు
సంస్కృతి ఏకవచనం కాదు
ఒక తరంనుండి మరొక తరానికి ప్రసరించేది

మా తరపు రేపటి ఆశలు మీరు
తరతరాల త్యాగధనుల ఆశలను పుష్పించే
జీవధారలు మీరు ధాతువులు మీరు
మా స్వప్నాల రేపటి సాకారం మీరు

అందుకు ఈరోజు మీకు
తొలి ఉమ్మడి అడుగు కావాలి
తడబడని మీ దృఢ నిశ్చయపు అడుగుల సవ్వడి
మా తరం ఆనందించే సుమధుర సంగీతం కావాలి

అందుకు
మీ రెండు జతల కళ్ళూ
ఒకే విప్లవ సుందర స్వప్నదృశ్యాన్ని వీక్షించాలి
మీ రెండు జతల కాళ్ళూ
ఒకే విప్లవ లక్ష్యం వైపు సాగాలి
మీ రెండు జతల చేతులూ
ఒకే విప్లవాన్ని నిర్మించాలి

(విప్లవోద్యమానికి అంకితమైన కొత్త జంటకోసం.....
'ఫీనిక్స్' శివసాగర్‌కి కృతజ్ఞతలతో)

# చైతన్యానికి ప్రతిరూపాన్ని

- డా॥ దిలావర్

**పడమటి** పెరట్లో వడలిన తీగకు కాసిన
కుక్క మూతి పిందెవు నువ్వు
నాకు తెలుసు
సినిసిజమ్ కౌగిళ్ళు మరిగిన నీకు
మనుషుల మీద నమ్మకం ఉండదని
పెస్సిమిజం ఎడారిలో పరుగులు తీసే నీకు
మనిషి గుండెలోని తడి విలువ తెలియదని
ప్రపంచం మెదడులోకి
నిహిలిజాన్ని ఇంజెక్టు చేస్తూ
గుహల్లో ముక్కు మూసుకొని కూచునే
నీ నిష్క్రియాపరత్వం నాకు తెలుసు
'నీషేలు' మళ్ళీ మళ్ళీ జరాసంధులై
సందు లేకుండా ప్రబలడం
ప్రపంచానికి కొత్తేమీ కాదు
నా చుట్టూ కటిక చీకట్లను నాటి
ఏకాంతపు ములుకులను గుండెల్లో దిగగొట్టి
నెత్తురోడుతున్న నా ఖండిత స్వప్నాలను చూస్తూ
వికటాట్టహాసం చేయడం
నా చిన్నారి ఆశల మొహంమీద
శాడిజం దిండుతో అదిమిపట్టి
ఊపిరాడకుండా ఉక్కిరి బిక్కిరి చేయడం
నీ హంతక మనస్తత్వానికి దర్పణం
నేను నేలకు కొట్టిన మట్టి ముద్దను కాను
చైతన్యానికి ప్రతిరూపాన్ని
నా కండలమీదా-స్వేదంమీదా
నెత్తురుమండే అజేయశక్తిమీదా
అపార విశ్వాసం వున్నవాణ్ణి
నువ్వు నాకు కాపలావుంచిన నిశిరాత్రిలోనే
ఉషోదయంకోసం స్వప్నిస్తున్నవాణ్ణి
భూగోళాన్నిపడమటినుండి తూర్పుకు తిప్పుతున్నవాణ్ణి
తిరోగామి దివాంధమా!
ఆగామి మహోదయ ప్రచండ కిరణాలను
అరచెయ్యి అడ్డంపెట్టి ఆపగలవా?

సంపాదకీయం

# చెట్లకు డబ్బులు కాయటంలేదు. సరే!! వాల్‌మార్టులకు పూస్తాయా?

**డబ్బులు** చెట్లకు కాయటం లేదనే గొప్ప సత్యాన్ని భారత ప్రధాని మన్మోహన్‌సింగ్ ఈ నెల 20వ తేదీన ఉద్వేగంతో ప్రవచించారు! డబ్బులు స్విస్సు బ్యాంకులకు ప్రవహిస్తాయని చెప్పటం కావాలని విడిచి పుచ్చారు. బొగ్గుగనుల లీజుల్లో ఒక లక్షా 86 వేల కోట్ల రూపాయల అవినీతి రూపంలో డబ్బులు దాగున్నాయని 'కాగ్' చూపించినా దోపిడీవర్గాల సేవలో మైమరచిన తన్మయ పరవశంలో కళ్ళు మూసుకు పోయి వున్నాడు. 'టెలికాం' నుండి కామన్‌వెల్తు క్రీడల దాకా, గనుల మైనింగు లీజులనుండి సెజ్జుల పేరిట లక్షల ఎకరాలను విదేశీ, స్వదేశీ దోపిడీదార్లకు కట్టబెట్టడందాకా పాలకులు ఏర్పరచిన అతి సులువుదారులలో డబ్బులు విచ్చలవిడిగా విహరిస్తున్నాయని దేశ ప్రజలకు తెలియనివ్వకుండా ప్రధాని ప్రసంగించారు.



'హిందూ' సౌజన్యంతో

గ్యాసు, చమురులకు సబ్సిడీ యిస్తున్నామనే సాకుతో, వాటిపై ప్రభుత్వాలు విధించిన వివిధ రకాల పన్నుల కిమ్మత్తును రహస్యంగా అణచిపెట్టి ఒక్క కలంపోటుతో వాటి ధరలను విపరీతంగా పెంచే చర్యలు తీసుకున్నారు. అమెరికా అదిలింపులూ, బెదిరింపులకు లొంగి ఇరాన్ నుండి భారత దేశానికి నేరుగా గ్యాసు సరఫరా చేసుకోవాలనే పథకాన్ని విరమించుకున్న ప్రభుత్వ లొంగుబాటును తనలోనే దాచుకున్నారు. మన కృష్ణా–గోదావరి బేసిన్‌లోని గ్యాసును వెలికితీసి అమ్ముకోవటంలో రిలయన్స్ కంపెనీ కపట నాటకాలాడి దళారీ పాత్ర నిర్వహించి విదేశీ కంపెనీలకు చల్లగా అమ్ముకున్నా మిన్నకున్న సంగతిని మరుగుపరిచి మాట్లాడారు.

21 ఏళ్ళక్రితం దేశ ఆర్థిక సంక్షోభానికి (సామ్రాజ్యవాద) ప్రపంచీకరణమే పరిష్కారమార్గమనీ దేశ ప్రజల జీవన వికాసానికి మరొక దారిలేదనీ ఆనాడు ఆర్థిక శాఖామంత్రిగా నొక్కి వక్కాణించిన నేటి ప్రధాని, ఇన్నేండ్ల తరువాత చమురు, గ్యాసులపై సబ్సిడీ ఎత్తివేయకపోతే తిరిగి 21 ఏళ్ళనాటి స్థితికే చేరతామని బెదిరించారు. అదే సమయంలో విదేశీ పెట్టుబడిదారులకు మన ఆర్థిక–రాజకీయ విధానాలపై విశ్వాసాన్ని కలిగించటానికి కూడా ఈ చర్యలు తప్పనిసరి అని ఘోషించారు. చిల్లర వ్యాపార రంగంలోకి (రిటైల్ మార్కెట్టు) విదేశీ వ్యాపారులు ప్రవేశిస్తే కోటి ఉద్యోగాలు లభిస్తాయనే మోసపూరిత మాటలతో అందుకు గతంలో వారికున్న సమస్త అడ్డంకులనూ తొలగించి ఇప్పుడు 51% నుంచి 100 శాతందాకా పెట్టుబడి పెట్టుకునే అవకాశాల్నిస్తూ ఆహ్వానం పలికారు. అంతేకాక విదేశీ పెట్టుబడులకు విమానయాన రంగంలోనూ, విద్యుత్తు, ప్రసార మాధ్యమాలలోనూ అనుమతిని విస్తరించారు.

ఇప్పటికే భారతి కంపెనీ మిలాఖత్తుతో విజయవాడ, గుంటూరు పట్టణాల్లో వున్న "వాల్‌మార్ట్" అనే అమెరికా(చిల్లర) వ్యాపార సంస్థ నడుస్తోంది. సెప్టెంబరు 25వ తేదీనుండి హైదరాబాదులో కూడా తన శాఖను ప్రారంభించింది. జర్మనీ దేశానికి చెందిన మెట్రో అనే సంస్థ విశాఖపట్నంలో కొంతకాలంగా వ్యాపారం చేస్తోంది.

వ్యవసాయరంగం తర్వాత ఎక్కువ మందికి ఉపాధిని కల్పిస్తున్న రంగంగా 'రిటైల్' వ్యాపారం వుంది. సుమారు ఒక కోటి 20 లక్షల కుటుంబాలు ఈ రంగంపై ఆధారపడి వున్నాయి. 4 నుండి 5 కోట్ల జనాభా దీనిద్వారా జీవనం సాగిస్తున్నారు. మన దేశంలో చిల్లర వర్తకపు షాపుల సరాసరి విస్తీర్ణం 500 చ. అడుగులయితే, వాల్‌మార్ట్ లాంటి బడా కంపెనీల సరాసరి విస్తీర్ణం 1,08,000 చదరపు అడుగులు. వాల్ మార్ట్‌కి ప్రపంచ వ్యాపితంగా 9800 మాల్స్ వున్నాయి. అమెరికా దేశంలో 65% చిల్లర వ్యాపారం మూడే మూడు కంపెనీల నిర్వహణలో గుత్తాధిపత్యం చెలాయిస్తున్నాయి. మెక్సికో దేశపు చిల్లర వ్యాపారంలో 50%, దక్షిణాఫ్రికాలో 80%, ఇండోనేషియాలో 23%, మలేషియాలో 28%, ఆస్ట్రేలియాలో 90%; చైనాలో 10% ఈలాంటి బడా బడా కంపెనీలు చిల్లర వ్యాపారాన్ని కైవశం చేసుకున్నాయి. వాల్‌మార్ట్ (28), మెట్రో(33) కారీఫోర్(32)–దేశాలలో తమ బడా మాల్స్‌ను తెరిచారు. మొత్తం 50దేశాల చిల్లర వ్యాపారం 8 కంపెనీల చేతులపై నడుస్తోంది. వీరి వ్యాపారం మొత్తం 52లక్షల కోట్ల రూ.లు. మన దేశ వార్షిక బడ్జెట్టుకు 3 రెట్లకు పైమాటే. అయినా వీరంతా 50 దేశాలలో కల్పిస్తున్న ఉద్యోగాలు 43 లక్షలు మాత్రమేకాగా, మనకు కోటి కొత్త ఉద్యోగాలు లభిస్తాయని స్వయంగా దేశప్రధానే ప్రకటించటం ఎంత మోసం?

వాల్‌మార్ట్ గురించి ఎమెస్కే బేకర్ అనే ఆర్థిక శాస్త్రజ్ఞురాలు యిలా చెప్పారు. "వాల్‌మార్ట్ ఉద్యోగాలను సృష్టిస్తుందా? అంటే అవును అన్నది సమాధానం. అది ఉద్యోగాలను ధ్వంసం చేస్తుందా అంటే కూడా అవును అన్నదే సమాధానం".

వాల్‌మార్ట్ సాగిస్తున్న దోపిడీ, దురాగతాలను ఎండగడుతూ, అమెరికా కోర్టుల్లో చట్టబద్ధంగా పోరాడుతున్న వేడ్ రాధ్కె, ఇండియాలో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూ ప్రకారం "థాయిలాండ్‌లో రిటైల్ రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను స్వేచ్ఛగా అనుమతించినందువల్ల 60వేల చిన్న దుకాణదారులు దివాళా తీశారు... అది పనిచేస్తున్న ప్రతి దేశంలోనూ కార్మిక సంబంధాలపై దాని ప్రభావం ప్రతికూలంగానే వుంది. మెక్సికోలో, అర్జెంటీనాలో వారు కార్మికులకు స్వల్ప వేతనాలు చెల్లించి దోపిడీ చేశారు. కార్మికుల సదుపాయాలకు కోత విధించారు. కాంట్రాక్ట్ పద్ధతిని బలవంతంగా ప్రవేశపెట్టారు".

ఈ కంపెనీలు "నేరుగా ఎక్కువ రేటును రైతుకు యిచ్చి కొనుగోలుచేసి, మధ్య దళారులు లేకుండా అతి తక్కువ రేటుకి వినియోగదారుడుకి అమ్ముతామని" బడాయిలు పోతున్నాయి. 'స్వేచ్ఛా వ్యాపారం' పేరిట అనాదిగా పెట్టుబడిదారీ వలస విధానం అనుసరించినదే తప్ప ఇదేమీ కొత్తది కాదు. చిన్న వ్యాపారులను పోటీనుండి గెంటివేసి, మార్కెట్టుపై గుత్తాధిపత్యాన్ని చెలాయించటానికీ, వినియోగదార్లను ఆకట్టుకునే బురిడీ మాటలు తప్ప యివి మరేం కావు.

ఫిలిప్పైన్స్ దేశంలో అరటిపళ్ళ రైతులకు జపాన్ దేశంలోని వినియోగదారులు కొనే ధరలో 17% మాత్రమే లభిస్తోంది. థాయిలాండ్‌లో కొన్న అనాసపండ్ల(పైన్‌యాపిల్)కు అమెరికాలో అమ్ముడయే ధరలో 10% మాత్రమే గిడుతుంది. అలాగే మన రైతులకు ముడిపత్తిపై అమ్మకం ధరలో నుండి 8%; పొగాకుకు 6%, అరటిపళ్ళకు 14% మాత్రమే వ్యాపార కంపెనీలు చెల్లిస్తున్నాయి. నడిమిన మిగిలినదంతా ప్రాసెసింగు, రవాణా, ప్యాకింగ్ చార్జీలకూ ఇంకా లాభాలకూ పోతాయి. ఈ విధానాలు రైతుల్ని దోపిడీ చేసి, అణగ దొక్కుతాయి, ప్రాసెసింగు, స్టోరేజి, పాకింగు, రవాణా కంపెనీలు లాభపడతాయి. అంతిమంగా రైతుల్నీ, వినియోగదారుణ్నీ నష్టపరుస్తాయి. అంతే కాదు గత కొన్నేండ్లుగా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఫలితంగా లక్షల సంఖ్యలో రైతులు ఆత్మహత్య చేసుకోవటం, మూసివేయబడ్డ పరిశ్రమల్లోని కార్మికులు గెంటి వేయబడటం, బడ్జెట్టు కోతకు గురయి ఉద్యోగాలు తరిగిపోతుండటం వల్ల చిల్లర వర్తకంలో ప్రవేశానికి వత్తిడి పెరిగిందని 'ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' అనే పత్రికలో 2005లోనే గురుస్వామి అనే ఆర్థిక విశ్లేషకుడు పేర్కొన్నాడు.

బడా బహుళజాతి కంపెనీల రాకతో మన దేశీయ వైవిధ్య పూరితమైన తిండి, బట్టలు, గృహోపకరణాల అలవాట్లు ఛిన్నాభిన్నమై కంపెనీల వారికి బాగా లాభాలను చేకూర్చిపెట్టే సరుకుల వినియోగదారులుగా మనం మార్చివేయబడతాము. వారికున్న మీడియా బలంతో మన సాధారణ అవసరాలు మటుమాయమై వారి విలాస, ఆడంబరాల వ్యామోహానికి అలవాటుపడే సంస్కృతిని మనపై రుద్దుతారు. ఇది మన సాంప్రదాయక ఉత్పత్తిదారుల్ని నష్టపరచటమే కాక మనదైన సాంస్కృతిక వైవిధ్యానికి తూట్లు పొడుస్తుంది.

సర్వసాధారణంగా కాలినడక దూరంలో చిల్లర దుకాణాలన్నీ అందుబాటులో వుండే జీవన విధానం మనది. నగరాలకు వెలుపల వుండే బడా మాల్స్ దగ్గరకు వాహనాలద్వారా తప్ప చేరుకోలేని విధంగా మార్పు జరుగనుంది. ప్రారంభంలో ఇవి సంపన్న, ఉన్నత మధ్యతరగతి వర్గాల వారికే పరిమితమయేట్లు కనిపించినా కాలక్రమంలో మొత్తం సాధారణ చిల్లర వర్తకాలను కూడా నష్టపరుస్తూ బడామాల్స్‌వారి బ్రాండ్లను అమ్మేవారిగా మన వర్తకులను మారుస్తుంది.

దేశీయ ఉత్పత్తులనుండి 30% కొనుగోలు చేసి తీరాలనే షరతు ఒకటి వున్నట్లుగా మనకు చెబుతున్నారుగానీ, ప్రపంచంలో ఎక్కడెక్కడి సరుకుల్ని, ఉత్పత్తుల్నైనా తెచ్చి ఇక్కడ అమ్ముకుని దేశీయ ఉత్పత్తిదారుల్ని ముఖ్యంగా చిన్న పరిశ్రమలను యిది తీవ్రంగా నష్టపరచగలుగుతుంది. ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందాల ప్రకారం పై నిబంధన చెల్లదు. నిబంధనలున్నా అతిక్రమించటం తెలిసిన వారికి, అవి కూడా లేకుంటే అంతా బరితెగింపే అవుతుంది.

ప్రధాని మన్‌మోహన్‌సింగ్ తీసుకున్న ఈ దేశద్రోహకర చర్యలకు వ్యతిరేకంగా, కారణం ఏమైనా, ప్రతిచర్యగా తృణమూల్ కాంగ్రెసు పార్టీ కేంద్ర ప్రభుత్వంనుండి తప్పుకున్నది. కాంగ్రెసువారే కొందరు పెంచిన ధరలను తగ్గించమంటున్నారు. ప్రతిపక్షాలు కొన్ని తీవ్రంగా విమర్శిస్తున్నాయి. అయినా తనవి కఠిన నిర్ణయాలుగా ప్రధాని పేర్కొంటున్నాడు. భారత ప్రభుత్వ చర్యలకు అమెరికాలో హర్షామోదాలు వెల్లుబుకుతున్నాయి. వారెదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యకు యిదొక ఉపశమనం కావచ్చు. రానున్న నవంబరులో జరుగబోయే అమెరికా అధ్యక్ష పదవి ఎన్నికల్లో ఒబామాను రాజకీయంగా గట్టెక్కించడానికి యిది తోడ్పడే చర్య కావచ్చు. ఆ తర్వాత యు.పి.ఎ. ప్రభుత్వాన్ని సురక్షితంగా కాపాడే బాధ్యతాయుత కర్తవ్యం అమెరికా నెరవేర్చునూవచ్చు.

మళ్ళీ విషయంలో కొస్తే... విదేశీ పెట్టుబడులతో చిల్లర వ్యాపారం అంటే, చిల్లరవర్తకంపైన గుత్తాధిపత్యానికి గేట్లు బార్లాతెరవడం. ఇది సామ్రాజ్యవాద ప్రపంచీకరణానికి తలవొగ్గిన భారత పాలకుల దళారీ విధానాల కొనసాగింపు. ప్రపంచబ్యాంకుకు దేశాన్ని పరాధీనంగావించి, నయావలస రూపాలకు 21 సంవత్సరాలుగా గంగిరెద్దుల్లా తలలూపుతున్న దేశద్రోహకర విధానాల పరాకాష్ట. మొదట ప్రభుత్వరంగ సంస్థల్ని స్వాధీనపరుచుకుని, తర్వాత ఖనిజాలు, భూమి, నీరు, అడవులనూ కొల్లగొట్టి, ఆ పిదప తమ అణ్వాయుధాల అవసరాలకు మన దేశాన్ని చెత్తకుండీగా మార్చి మొత్తంగా దేశీయ మార్కెట్టును కూడా వశపరుచుకునే క్రమంలో భాగంగా దీన్ని అర్థం చేసుకోవాలి. కనుక రిటైల్ రంగంలో విదేశీ పెట్టుబడులకు వ్యతిరేకంగా సాగించే పోరాటం సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టాల్సివుంటుంది.

చివరగా ఒక మాట! డబ్బులు చెట్లకు కాయనిమాట నిజమే! అయితే వాల్‌మార్టులకు పూస్తాయా? దేశీయ రిటైల్ వర్తకమైనా, విదేశీ వాల్‌మార్టైనా అవి పంపిణీ రంగాలేకానీ ఉత్పత్తి వ్యవస్థలు కావు. సమస్త మానవ వినియోగ అవసరాలకు మూలం వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తులు. వాటిని నిర్వహించటానికి ఏర్పడినవే పంపిణీ వ్యవస్థ సేవలు. కనుక డబ్బులు కాసేది కార్మికుల, రైతుల యితర కష్టజీవుల శ్రమలనుండి! 'కూలివాని చెమటలో ధనమున్నదిరా. పాలెకాపు కండల్లో ధనమున్నదిరా" అన్న ఆరుద్ర మాటల్లోని అంతరార్థం యిదే. ధనాన్ని సృష్టించే శ్రమజీవుల జీవితాలను విధ్వంసంగావించే ఏ విధానాలూ ప్రశాంతంగా అమలుకు నోచుకోవు. సంపదల సృష్టికర్తలకే సంపదలపై అధికారం లభించేదాకా వారి ప్రతిఘటనను రుచిచూడక తప్పదు.

**– 26-9-2012**

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1224**

* * *

**Read other issues of Praja Sahiti Magazine@**

**http://kinige.com/kbrowse.php?via=author&id=58**